01ATP27F_01ATP27F.qxd 27-09-2023 PM 10:56 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 28 సెప్టెంబర్ 2023 పేజీలు : 04




టిడిపి జిల్లా నేతలు ఎన్టీఆర్‌విగ్రహం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

# అనంతలో పెల్లుబికిన ప్రజానీకం

+ వేల సంఖ్యలో రోడ్లపైకి + కాగడాల ప్రదర్శనతో కదం తొక్కిన మహిళలు

+ లెక్కచేయని పోలీస్ ఆంక్షలు + ర్యాలీలో టిడిపి, జనసేన, సిపిఐ నేతలు

**అనంతపురం, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త బ్యూరో**

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అరెస్టు నిరసిస్తూ జనం వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. మహిళలు సామాన్య ప్రజలు కూడా పెద్ద ఎత్తున ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం అనంతపురం నగరంలోని ప్రధాన వీధుల్లో టిడిపి, జనసేన, సిపిఐ నేతలు ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన పేరుతో జరిగిన ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగడాల ప్రదర్శనతోపాటు ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా, చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మాజీ సీఎం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపారంటూ ఉమ్మడి జిల్లా టిడిపి నేతలు, జనసేన, సిపిఐ నాయకులు కార్యకర్తలు, ఆయా పార్టీల అభిమానులు ర్యాలీ నిర్వహించారు. ఈ కాగడాల ప్రదర్శనకు, ర్యాలీకి అనుమతి లేదని పోలీసు అధికారులు ప్రకటించడంతోపాటు నిరసన కార్యక్రమాలకు అడ్డంకులు సూచించినప్పటికీ ఈ ర్యాలీకి పెద్ద ఎత్తున తరలి రావడం విశేషం అని చెప్పొచ్చు. అనంతపురం శివారు లోని రుద్రంపేట బైపాస్ నుంచి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా పరిషత్, సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు కాగడాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మాజీ మంత్రులు పరటాల సునీత, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, పరిటాల శ్రీరామ్ సతీమణి, జనసేన జిల్లా నాయకులు భవాని రవికుమార్, టిడిపి నాయకులు సరిపూటి రమణ, ఆదినారాయణ, మహిళా నాయకురాలు గాండ్ల విశాలాక్షి, విజయశ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి అనుమతి లేదని పోలీసు అధికారులు ప్రకటించి ప్రధాన కూడలిలలో పోలీసు బృందాలు మకాం వేసినా కాగడాల ప్రదర్శనతోపాటు నిర్వహించిన ర్యాలీలో ఎక్కువ మంది జనం పాల్గొనడం విశేషం. సీఎం జగన్‌డౌన్ డౌన్, చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి తదతర డిమాండ్లతో ప్లకార్డులు పెట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నేతలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, పార్థసారధి, కందికుంట వెంకట ప్రసాద్, పరిటాల శ్రీరామ్ తదితరులు మాట్లాడుతూ.. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వంపై తిరగబడే విధంగా జనం రోడ్లపైకి వచ్చారని ఇందుకు అనంతపురంలో జరిగిన ర్యాలీనే ఉదాహరణ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యతో టిడిపి నేతలపైనే అక్రమ కేసులు పెడుతూ వస్తూ చివరకు తమ అధినేతపైనే అక్రమ కేసులు పెట్టాడన్నారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు ఈ ప్రజా నిరసన అద్దం పడుతోందని, ఇప్పటికైనా పాలకులు తమ తప్పును తెలుసుకోవాలని హెచ్చరించారు.



ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్



అనంతలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం







## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించండి

### - బ్యాంకర్లు,అధికారులు సమన్వయంతో పని చేయాలి - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు





డిఎల్‌ఆర్‌సి సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు , హాజరైన బ్యాంకర్లు, అధికారులు

**శ్రీసత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త ప్రతినిధి:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు నిర్వహించిన జిల్లా స్థాయి రివ్యూకమిటీ (డిఎల్‌ఆర్‌సి) సమావేశం నందు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకర్లతో పరిశ్రమలు,వ్యవసాయం, డిఆర్‌డిఎ, మెప్మా తదితరశాఖఅధికారులు సమన్వయం చేసుకొని పనిచేయాలని, ఆయాపథకాలక్రింద కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించి రుణాలు మంజూరు చేయాలన్నారు. స్టాండప్ ఇండియా, జగనన్న బడుగువికాసం, ప్రధాన మంత్రి ముద్రయోజన, పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన మంత్రిముద్ర యోజన క్రింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను జూన్ నెలాఖరుకు 17281మంది లబ్ధిదారులకు రూ.233.98కోట్లు రుణాలుగా మంజూరుచేయడం జరిగిందని, మరింత మంది లబ్ధిదారులకు రుణాలు అందించేలా చూడాలని సూచించారు. అర్హతకలిగిన వారికి విద్యారుణాలు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులకు పంటరుణాలు, పిఎం జవనజ్యోతి బీమా యోజనా, పిఎం సురక్ష బీమా యోజన క్రింద కేఆయించిన లక్ష్యాలను ఇప్పటికే పూర్తిగా చేరుకోగా, పిఎం సురక్ష బీమా యోజన క్రింద స్వయం సహాయక సంఘాల మహిళలకు బీమా కవరేజ్ చేయాలన్నారు. డిఆర్‌డిఎ , మెప్మా పరిధిలోని మహిళా సంఘాలతో నిర్వహించే సమావేశాల్లో ఈ విషయమై సభ్యులకు తెలియజేయాలని, ప్రత్యేకడ్రైవ్‌పెట్టి అవగాహన కల్పించాలన్నారు. జగనన్న తోడు క్రింద లబ్ధిదారులకు రుణాలు మంజూరు, పంపిణీ 100 శాతం పూర్తి చేయాలని సూచించారు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ క్రింద భారత ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలు,కోళ్ళు, పందుల పెంపకం యూనిట్ల స్థాపనకు సబ్సిడీ పథకాన్ని ప్రారంభించిందని, పశువుల యూనిట్లను స్థాపించడం పెద్ద సంఖ్యలో రైతులను ప్రోత్సహించడానికి బ్యాంకర్లు విరివిగా ఆర్థిక సహాయం చేయాలని, పాడి రైతులకు అవసరమైతే ప్రోత్సాహం అందించినందు విరివిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వివర్స్ ముద్రా పథకం క్రింద ఈ ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుల్లో 13,795 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, 184 కొట్ల రూపాయలు ఖర్చు చేయడానికి ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు. స్టాండర్డ్ పథకం క్రింద 38 అకౌంట్లు ఉన్నాయని, రూ.8.36కోట్ల రూపాయలు ఖర్చుచేయడానికి కార్యాచరణ ప్రణాళికలు వేగవంతం చేయాలని తెలిపారు. అర్హులైన వారికి త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని, ప్రధానమంత్రి ఎంప్లామెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ క్రింద కేటాయించిన లోఆ్యలను పూర్తి చేయాలని, హార్టికల్చర్ పరిధిలో ప్రధానమంత్రి ఫార్మలజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ కింద కేటాయించినల క్ష్యాలకు అనుగణంగా యూనిట్లు మంజూరు చేయాలన్నారు. సిసిఆర్‌సి కార్డుదారులకు కూడా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, అధికారులు బ్యాంకర్లు సమన్వయం చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో విరివిగా రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సామవేశంలో ఎల్‌డిఎం ఎ.వి.రమణకుమార్, ఆర్‌బిఐ ఎల్‌డిఓ రెహమాన్ (హైదరాబాద్), ఎపిజిబి ఆర్‌ఓ రవీంద్రారెడ్డి, ఎల్‌డిఓ వివేకాంద (కడప), డిక్కీ మరియు ఫిక్కీ సభ్యులు రమణ, ప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంకెళ్ళు వేసుకొని వినూత్నరీతిలో నిరసన తెలిపిన తెదేపా నాయకులు



సంకెళ్ళతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి పల్లె, తెదేపా నాయకులు దృశ్యం

**పుట్టపర్తిటౌన్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరశిస్తూ చేతులకు సంకెళ్ళు వేసుకొని వినూత్న రీతిలో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన నిరసన కార్యక్రమం 16వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీమంత్రి పల్లెరఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం కుట్రపూరితంగా చంద్రబాబును అక్రమ అరెస్ట్ చేశారని, ఇలాంటి నీతిమాలిన చర్యలు వైసిపి ప్రభుత్వం మానుకోవాలని లేదంటే ప్రజా ఉద్యమంలో మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. వచ్చే ఎన్నికలలో వైసిపి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుంది. చంద్రబాబు పర్యటనలకు, లోకేష్ పాదయాత్రకు ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి ఓర్వలేక జగన్ ఇలాంటి తప్పుడు కార ్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రం లోనే కాక, వివిధ రాష్ట్రాలు, ఇతర దేశాలలో కూడా చంద్రబాబుకు ప్రజలు సంఘీభావం తెలుపుతున్నారన్నారు. కడిగిన ముత్యంలా చంద్రబాబు తిరిగి బయటకు వచ్చే రోజు దగ్గర్లోనే ఉందని, ఇలాంటి కుట్రపూరిత సంఘటనలు పునరావృతం కాకుండా జగన్‌మేలుకోక పోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారనిహెచ ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు బచ్చల పుల్లయ్య, టిడిపి నాయకులు రత్నప్ప చౌదరి, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్, బొమ్మయ్య, శ్రీరామ్ రెడ్డి, ఆరు మండలాల నుండి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లేపాక్షికి కేంద్ర ప్రభుత్వ టూరిజం అవార్డు రావడం అభినందనీయం

### - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**శ్రీసత్యసాయిజిల్లా, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త ప్రతినిధి:**

మన నేచర్ మన టూరిజానికి ఫ్యూచర్, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన లేపాక్షికి కేంద్ర ప్రభుత్వ టూరిజం అవార్డు రావడం అభినందనీయమని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సాయి అరామం నందు జిల్లా పర్యటక, సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం-2023 వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటకరంగం అభివృద్ధి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు, పర్యాటక రంగంలో విశేష కృషి చేసిన వివిధ వ్యక్తులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అవార్డు గ్రహీతలకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, లేపాక్షి గ్రామం 2023లో భారత దేశంలోని ఉత్తమ పర్యాటక గ్రామంలో ఒకటిగా ఎంపికకావడం, రాష్ట్రానికి,జిల్లాకు గర్వకారణమన్నారు. జిల్లాలో అపారమైన ర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, విద్యార్థులు సందర్శించి మీ తల్లిదండ్రులతో కూడా వెళ్ళి పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించాలన్నారు. దక్షిణ భారత దేశంలోని అతిపెద్దతిమమ్మ మర్రిమాను, సుమారు 8.75 ఎకరాలలో విస్తరించి ఉందని, 6689 ఊడలతో ఉన్న ఈ మర్రిమాను 1989లో గిన్నిస్ బుక్‌నందు చోటుదక్కించుకుందన్నారు. కటారుపల్లిలో యోగివేమన సమాధి ఉందని, లేపాక్షి కళదత్ర వారసత్వ సంపద నిలయంగా మారిందని, లేఆపక్షి నందు నందీశ్వరుని ఏకశిల విగ్రహం దేశంలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. అంతకుమునుపు పర్యాటక రంగం దినోత్సవం సందర్భంగా పుట్టపర్తిలో ఆసుపత్రి నుండి సాయి అరామం వరకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గొప్ప ర్యాలీని పుట్టపర్తి ఆర్‌డిఓభాగ్యరేఖ జెండాఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మినరసమ్మ, టేరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






సాంస్కృతిక కార్యక్రమాలతో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు , సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు





జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌డిఓ భాగ్యరేఖ, , అవార్డులు అందిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

02ATP27_02ATP27.qxd 27-09-2023 PM 10:55 Page 1



## అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు



పోలీసులు ముందస్తు నోటీసులు అందజేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని, చంద్రబాబు ఏ తప్పు చేయలేదని అక్రమంగా అరెస్టు చేశారని 80 దేశాల్లో చంద్రబాబుకు సంఘీభావంగా మద్దతు తెలుపుతున్నారని కళ్యాణదుర్గం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వరనాయుడు తెలిపారు. 27/09/2023న అనంతపురం పట్టణంలో బాబుతో నేను సైతం అంటూ కాగడాల ప్రదర్శనకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు పేరుతో నోటీసులు ఇవ్వడం అధికార దర్పంతో పోలీసులు అడుగడుగునా అడ్డుకుంటున్నారని అయినప్పటికీ ఏ గ్రామంలో చూసినా చంద్రబాబు నాయకత్వం కోసం కోరుకుంటూ ముందుకు సాగుతున్నారు అన్నారు. న్యాయం కోసం పోరాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం కాకుండా అంబేద్కర్ రాజ్యాంగం కోసం ప్రతి ఒక్క పౌరుడు ఈ రోజు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు జైలు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు.

## బెస్తరపల్లిలో దళిత బాలుడికి అనారోగ్యం

### - ఆర్థిక సహాయం చేసిన టిడిపి ఇన్‌చార్జ్ ఉమ



ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నేతలు

**కళ్యాణదుర్గం టౌన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

నియోజకవర్గంలోని కుందుర్పి మండలం, బెస్తరపల్లి గ్రామంలోని, నిరుపేద కుటుంబానికి చెందిన హరిజన గోవిందరాజులు, నీలమ్మలకు జన్మించిన రెండు సంవత్సరాల వయస్సుగల కుమారుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకొన్న కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు మానవత్వంతో స్పందించారు. ఈ మేరకు 27/09/2023న కళ్యాణదుర్గంలోని, తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చంద్రన్న స్ఫూర్తితో.. ఉమమహేశ్వరనాయుడు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుందుర్పి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకోవాలి తహశీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

**బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త,**

బాల్యవివాహాలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో బాల్యవివాహాలపై, అసభ్యకర ప్రవర్తనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ప్రతి విద్యార్థినిలు తల్లిదండ్రులు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్ళిళ్ళు చేయడాన్ని అరికట్టడం విద్యార్థుల చేతిలోనేవుందని అన్నారు ప్రతిఒక్కరూ చైల్డ్‌కేర్ టోల్‌ఫ్రీనెంబర్ 1098కు కాల్‌చేసి బాల్యవివాహం జరగకుండా చూడాలని అన్నారు. అనంతరం ఎంపిడీఓ దాసానాయక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాల్యవివాహాలు అరికట్టడంలో కలిసికట్టుగా నిర్మూలించాలని అన్నారు బాల్యవివాహాలవలన జరిగే నష్టాలను గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమం ద్వారా అవంగాహన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులకు ప్రోగ్రాం స్క్రీన్‌పై అవగాహన వీడియోస్‌ను చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఓబుళపతి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, అర్‌డీటి ప్రోగ్రాం డైరెక్టర్ అదినారాయణ, ప్రిన్సిపాల్ పుష్పావతమ్మ, ఏఓ నందకిషోర్, అంగన్‌వాడి సూపర్‌వైజర్‌లు కాసీంబి, రామాంజినమ్మ పాల్గొన్నారు.

## మేముసైతం బాబుతోనే అంటూ కోనాపురం తెదేపా నాయకులు



కరపత్రాలతో నిరసన తెలుపుతున్న తెదేపా నాయకులు

**బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 27 ప్రభాతవార్త,**

మేముసైతం బాబుతోనే అంటూ కోనాపురం తెదేపా నాయకులు నిరసన తెలిపారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసన తెలుపుతూ సర్పంచ్ మల్లేల వనిత, క్లస్టర్ 01 ఓబుళేషు అధ్వర్యంలో మేముసేతం బాబుతోనే అంటూ గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంచారు వైసీపి ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు వారు ప్రజలను దోచుకొంటున్న తీరును ప్రజలకు వివరించారు. అక్రమఅరెస్టులతో తెదేపా పార్టీని బలహీనం చేయాలన్న వైసీపికుట్రను గ్రామస్థాయిలో కార్యకర్తలు, నాయకులు ఎదుర్కోనేందుకు సిద్దంగా వున్నారని తెలిపారు. అనంతరం కాగడాల ప్రదర్శనకు అనుమతిలేదని కన్వీనర్ తదితరులకు పోలీసులు నోటీసులు జారీచేశారు.

## జిపిఎస్ అంతం యుటిఎఫ్ పంతం

**మడకశిర టౌన్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

ఓపిఎస్‌ను వెంటనే అమలు చేయాలి లేదంటే ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక శక్తి ఏమిటో ప్రస్తుత వైసిపి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తెలియజేస్తామని వారు హెచ్చరించారు. గతంలో రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి జిపిఎస్‌రద్దు చేస్తామని ఉపాధ్యాయులను నమ్మి అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరం కావస్తున్నా కొత్తకొత్త నినాదాన్ని తీసుకొని జిపిఎస్‌తో రెండు లక్షల కుటుంబాలలో చీకటి నింపారు. బుధవారం మడకశిర పట్టణంలోని వైఎస్‌ఆర్‌సర్కిల్‌లో జిపిఎస్ నేడు రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన గ్యారెటీ పెన్షన్ స్కీమ్ చట్ట ప్రతులను ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యం కాదని దహనం, జీవో కరపత్రాలను దహనం చేసి యుటిఎఫ్ శాఖ నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సత్యసాయి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు బూతన్న, మండల కార్యదర్శి మహాలింగప్ప, సహాధ్యక్షుడు జోగప్ప, ఉపాధ్యాయులు ముళ్లగిరియప్ప, గుడిబండ యుటిఎఫ్ అధ్యక్షులు నరసింహప్ప, కదిరన్న, నరసింహమూర్తి, రమేష్, గంగాధర్, సూర్యప్రకాష్, అశోక్, గంగులప్ప, దేవరాజు శాఖ చేసినటువంటి నిరసన కార్యక్రమానికి మద్దతుగా మడకశిర తాలూకా సిపిఐ అధ్యక్షురాలు పవిత్ర పాల్గొన్నారు.



జిపిఎస్ రతులు ప్రతులను దహనం చేసిన యుటిఎఫ్ నాయకులు

## విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి



విద్యుత్ చార్జీలు, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

**పుట్టపర్తిటౌన్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాడుతామని సిపిఎం, సిపిఐ, సిఐటియు, రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. బుధవారం గణేష్ సర్కిల్ నందు పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యవసర సరుకుల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌లు మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ ధర్నా చేపట్టామని, అన్నిదరలను పెంచి ప్రజల నడ్డీ విరిస్తున్నారని విమర్శించారు. ఈ రోజు నిత్యవసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయని, అంగన్‌వాడీ కార్యకర్తలు గత రెండు రోజులుగా తమ సమస్యలపై చలో విజయవాడచేపడితే ఎక్కడికక్కడ అరెస్టలు చేసి మహిళలు అని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. జగన్ పాదయాత్రలో ఎన్నో హామీలు ఇచ్చి లక్షల కోట్లు అప్పు తెస్తున్నాడన్నారు. మోడికి భయపడి వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగిస్తున్నారని, రైతులకు ఉరితాళ్ళు బిగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపై ఆందోళనలు చేస్తే ప్రతిపక్షాలను ప్రజా సంఘాలను అణచివేస్తున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కూని అయ్యిందన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ఈ ప్రభుత్వం ధరలు నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంల సిపిఎం, సిపిఐ, రైతు సంఘం నాయకులు జె.వి.రమణ, బడసుబ్బిరెడ్డి, ఆంజనేయులు, శ్రీరాములు, వినోద్, వేమనారాయణ, పైపల్లి గంగాధర్, బ్యాళ్ళ అంజి, మహిళా సంఘం నాయకులు పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

## డిఇఓకు వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకుల వినతి



డిఇఓకు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్ఆర్‌టిఎఫ్, పిఆర్‌టియు నాయకులు

**పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

పనిసర్దుబాటుపై జిల్లా విద్యాశాఖ అధికారి యు.మీనాక్షికి వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు బుధవారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పని సర్దుబాటులో భాగంగా ఏ స్కూల్ లోను ఉపాధ్యాయుల లోటు లేకుండా చూడాలని, అదనపు ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలల్లో తమ అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడేవారికి ప్రాధాన్యత కల్పించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని, వీలైనంత త్వరగా పనిసర్దుబాటు ముగించాల, ఉమ్మడి జిల్లాను ప్రాతిపాదికనతీసుకొని అదనంగాచూపడిన వారికి వారి ప్రాధాన్యత ప్రకారం సర్దుబాటు చేయాలి. వైఎస్ఆర్‌టిఎఫ్, పిఆర్‌టియు జిల్లా నాయకులు పి.వి.రమణారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, నబిసాహెబ్, రంఘధామ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, కేశప్ప తిదతరులు డిఇఓ మీనాక్షి, ఎడి నాగరాజులకు సమస్యలపై పరిష్కారం చూపాలని వినతిపత్రం సమర్పించారు.

## జిపిఎస్ బిల్లులను దగ్ధం చేసిన యుటిఎఫ్ నాయకులు



జిపిఎస్ విధానంపై నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

**పుట్టపర్తిరూరల్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

ఉపాధ్యాయ లోకం వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం బలవంతగా బుధవారం అసెంబ్లీలో జిపిఎస్ విధానంను అమలు చేయడాన్ని నిరశిస్తూ యుటిఎఫ్ నాయకులు పుట్టపర్తిలోని హనుమాన్ కూడలిలో జిపిఎస్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు శివ కందుకూరి మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిఎస్ విధానాన్ని ఆమోదించటం అత్యంత బాధాకరమని, గ్యారెంటి లేని పెన్షన్ విధానానికి గ్యారెంటీ పెన్షన్ అనే పేరు పెట్టి దాన్ని ఆమోదించడం అత్యంత దారుణమన్నారు. 2004 నుండి యుటిఎఫ్ పాత పెన్షన్ సాధనకై గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటాలు కొనసాగించిందని తెలిపారు. భవిష్యత్తులో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పాత పెన్షన్ సాధనకే కృషి చేస్తుందని తెలిపారు. నరేష్ మాట్లాడుతూ, జిపిఎస్ విధానం ఏ మాత్రం ఆమోద్యయోగ్యం కాదని, ఉద్యోగుల భవిష్యత్తును ఈ విధానం ద్వారా అగమ్యగోచరం చేయడం దారుమన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, బాబయ్య, సురేస్, శ్రావణ్, తిప్పన్న, రమేష్, ఫిరోజ్, శ్రీనివాసులు, నాగేంద్ర, రామచంద్రరాజు, జనార్ధన్, వర్మ, రామాంజి, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

## బుడగ జంగాల సంబరాలు

### - ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మాణంపై హర్షం

### - ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న బుడగ జంగాల నాయకులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

బుడగ జంగాలను తిరిగి ఎస్సీల్లో చేర్చాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణంచేసి కేంద్రానికి పంపడంపై బుడగ జంగం సామాజికవర్గం బుధవారం ఉరవకొండలో సంబరాలు నిర్వహించింది. స్థానిక ప్రధాన కూడలిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి దివంగత సీయం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుడగ జంగాల మండల అధ్యక్షులు మహేంద్ర మాట్లాడుతూ బుడగ జంగం సామాజికవర్గాన్ని ఎస్సీ జాబితాలో పునరుద్ధరించాలని గడిచిన అనేక సంవత్సరాలుగా బుడగ జంగాలు కోరుతున్నారని నేటి తమ కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మాణం చేయించారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వీలైనంత త్వరగా ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుడగ జంగం నాయకులు నాగయ్య, మారెన్న, కుళ్లాయప్ప, అంజి. గోపాల్, సుధాకర్, బాబయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్





నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల దృశ్యాలు



**కొత్తచెరువు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ బుధవారంతో ముగిశాయి. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లాజర్, ప్రధానోపాధ్యాయులు వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల్లో క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అండర్ 14, అండర్ 17 క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్-14లో కోకో, బాల్‌బ్యాడ్మింటన్ త్రోబాల్ పోటీల్లో కొత్తచెరువు జట్టు విన్నర్‌గా, కోకో, త్రోబాల్‌లో ఓడిసి జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ టెన్నీకాయిట్‌లో ఓడిసి, జట్టు విన్నర్‌గా కొత్తచెరువు టెన్నీకాయిట్ రన్నర్‌గా నల్లమాడ జట్టు నిలిచాయి. షటిల్, కబడ్డీ, పోటీలలో బుక్కపట్నం జట్టు విన్నర్‌గా నిలవగా నల్లమాడ జట్టు రన్నర్‌గా నిలిచింది. అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల పరుగు లాంగ్ జంప్‌లో మేఘన తలమర్ల, కొత్తచెరువు గెలుపొందగా షాట్‌పుట్ నల్లమాడ విద్యార్థి గెలుపొందారు. అలాగే అండర్ 17లో గెలుపొందిన జట్ల వివరాలు కబడ్డీ బాల్ బ్యాడ్మింటన్ కోకోలలో కొత్తచెరువు జట్టు విన్నర్‌గా నిలిచింది. కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్‌లో బుక్కపట్నం జట్టు రన్నర్‌గా, కబడ్డీలో నల్లమాడ జట్టు రన్నర్‌గా నిలిచింది. త్రో బాల్, వాలీబాల్‌లో ఓడిసి జట్టు విన్నర్‌గా నిలవగా, త్రోబాల్, వాలీబాల్‌లో కొత్తచెరువు జట్టు రన్నర్‌గా నిలిచింది. షటిల్ యోగలలో బుక్కపట్నం జట్టులు గెలుపొందగా, షటిల్ క్రీడలందు రన్నర్‌గా ఓడిసి జట్టు యోగ నందు కొత్తచెరువు నిలిచింది. అథెటిక్స్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో ఓడిసి షాట్‌పుట్‌లో బుక్కపట్నం, లాంగ్ జంప్‌లో కొత్తచెరువుకు చెందిన విద్యార్థి విజయం సాధించాడు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు ఎంపికైన విద్యార్థులు స్కాలర్‌షిప్ పోర్టల్ నమోదు చేసుకోవాలి

**కొత్తచెరువు, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లాలో ఎన్ఎంఎంఎస్ నేషనల్ మీన్స్ కం స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను స్కాలర్షిప్ పోర్టల్ నందు అక్టోబర్ 1వ తేది నుండి నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మీనాక్షి తెలిపారు. 2003వ తేదిన విద్యాసంవత్సరంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా మెరిట్ కార్డుపై ముద్రించిన విధంగా బ్యాంకు పాస్ పుస్తంలో ఉండే విధంగా చూసుకోవాలి తమ వివరాలను అక్టోబర్ 30వ తేది లోపు నమోదు చేసుకోవాలని, విద్యార్థులు వివరాలను సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్స్ డిసెంబర్ 15వ తేదీలోగా పరిశీలించి ఎన్ఐఓ ద్వారా ధృవీకరించే పత్రాలను డిసెంబర్ 30 తేదీలోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంకు సమర్పించి జిల్లా నోడల్ ఆఫీసర్ (డిఎన్ఓ)ద్వారా అప్లికేషన్స్ ధృవీకరించుకోవాలన్నారు. అదే విధంగా 2019-2021 మార్చి 2022 సంవత్సరంలో ప్రభుత్వ, ఏయిడెడ్ పాఠశాలలో కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం తప్పకుండా రెన్యువల్ చేసుకోవాలని డిఇఓ సూచించారు. రెన్యువల్ కాని మెడల స్కాలర్‌షిప్ వర్తించదు అని ఆమె తెలిపారు.

## బుడగ జంగాల సంబరాలు

### - ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మాణంపై హర్షం

### - ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**ఉరవకొండ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

బుడగ జంగాలను తిరిగి ఎస్సీల్లో చేర్చాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణంచేసి కేంద్రానికి పంపడంపై బుడగ జంగం సామాజికవర్గం బుధవారం ఉరవకొండలో సంబరాలు నిర్వహించింది. స్థానిక ప్రధాన కూడలిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి దివంగత సీయం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుడగ జంగాల మండల అధ్యక్షులు మహేంద్ర మాట్లాడుతూ బుడగ జంగం సామాజికవర్గాన్ని ఎస్సీ జాబితాలో పునరుద్ధరించాలని గడిచిన అనేక సంవత్సరాలుగా బుడగ జంగాలు కోరుతున్నారని నేటి తమ కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మాణం చేయించారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను వీలైనంత త్వరగా ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుడగ జంగం నాయకులు నాగయ్య, మారెన్న, కుళ్లాయప్ప, అంజి. గోపాల్, సుధాకర్, బాబయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఉరవకొండకు కొత్తగా పోలీసు రోడ్డు భద్రత వాహనం..!

### -జాతీయ రహదారిలో వినియోగంలోకి రానున్న సేవలు




**ఉరవకొండ, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

ఉరవకొండకు కొత్తగా పోలీసు రోడ్డు భద్రత వాహనంను కేటాయించారు. ఈ వాహనం ఉరవకొండ రూరల్ సర్కిల్ ప్రారంభమయ్యే కూడేరు మండలం ప్రారంభం నుండి విడపనకల్లు మండలం చివరి వరకు 42 నంబర్ జాతీయ రహదారిలో సేవలందించనుంది. ఇందులో ఒక ఏఎస్ఐ లేదా హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉంటుండగా ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగినపుడు తక్షణం అక్కడికి చేరుకొని క్షతగాత్రులకు సాయం అందించడం, సరైన సమయంలో అంబులెన్స్‌లు ఘటనా స్థలానికి చేరుకోలేని పరిస్థితుల్లో బాధితులను చికిత్సకై ఆసుపత్రులకు తరలించడం, ట్రాఫిక్ స్తంభించకుండా క్రమబద్దీకరించడం, దారి దోపిడీలను నివారించడం లాంటి సేవలు అందించనుంది. బుధవారం సేవలను అప్‌గ్రేడ్ స్టేషన్, రూరల్ సర్కిల్ సీఐలు వి.హరినాథ్, బి.శేఖర్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామిలు వాహనం సేవలను వినియోగంలోకి తెచ్చారు.

## ఆశ్రయ లబ్ధిదారులకు త్వరలో ఇళ్ల పంపిణీ

### - రాష్ట్ర గృహవసతి శాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ వెల్లడి

**బళ్లారి, సెప్టెంబర్27, ప్రభాతవార్త ;** నగరంలోని ముండ్రగి ఆశ్రయ కాలనీలో రాజీవ్‌గాంధీ వసతి సంస్థచే నిర్మిస్తున్న ఆశ్రయ ఇళ్లను పూర్తి చేసి వీలైనంత త్వరగా అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని రాష్ట్ర గృహ వసతి శాఖ మంత్రి బి.జెడ్.జమీర్‌అహ్మద్‌ఖాన్ హామీ ఇచ్చారు. బళ్లారిలో ముండ్రగి ఆశ్రయ ఇళ్లలేఅవుట్ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి ఐదుబ్లాకుల్లో నిర్మించిన ఇళ్లనుపరిశీలించారు. ముండ్రగి ఆశ్రయకాలనీలో సుమారు 56ఎకరాల విస్తీర్ణంలో రూ.365కోట్ల వ్యయంతో 5616 ఇళ్లను నిర్మిస్తున్నట్లు, మొదటి విడతలో 2,592 ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడం జరుగుతుంది. అందులో ఇప్పటికే 365 ఇళ్లు పూర్తి కాగా, వెయ్యి ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయి. మిగిలినవి బేస్‌మెంట్ పనులు జరిగినట్లు చెప్పారు. ఇప్పటివరకు పూర్తి అయిన ఇళ్లను త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు పంపిణీచేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంలో బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్.టి.శ్రీనివాస్, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

### - స్లమ్‌బోర్డు ఏఈఈ కృష్ణారెడ్డి సస్పెండ్

బళ్లారి మురికివాడల అభివృద్ధి ఏఈఈ కృష్ణారెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. బళ్లారి పర్యటనకు వచ్చిన గృహవసతి శాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ జిల్లాలో వసతియోజన కింద చేపట్టిన గృహాలను సందర్శించి పరిశీలన జరిపే సందర్భంలో ఏఈఈ కృష్ణారెడ్డి హాజరుగాకపోవడం మంత్రి ఆగ్రహానికి కారణమయ్యింది. ఇటీవల జనతా దర్శన్ జరగగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ప్రగతి పరిశీలన సభకు కూడా ఏఈఈ కృష్ణారెడ్డి హాజరుగాకపోవడం పరిగణించి కర్తవ్యం పట్ల నిర్లక్ష్యం వ్యవహరించడంతో మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ తక్షణమే అతడిని సస్పెండ్ చేయాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా బళ్లారి స్లమ్‌బోర్డు ఏఈఈగా ఉన్న కృష్ణారెడ్డి లబ్ధిదారులకు మంజూరైన సబ్సిడీ రుణం సక్రమంగా వినియోగించకుండా లబ్ధిదారులకు న్యాయం చేయడంలో తీవ్ర అలసత్వం చేయడంతోపాటు అనేక ఆరోపణలు వస్తుండడంతో అతడిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహవసతి శాఖ ఉప కార్యదర్శి సి.శివన్న సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## శ్రీవారి హుండీల దోపిడి సంఘటనలలో ఎంతటివారినైనా ఉపేక్షించం...

### - రూరల్ సిఐ ఓ.మహేశ్వరరెడ్డి

### - హుండీల దోపిడిలో ఎ-2 ముద్దాయి అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు... - పరారీలోని ఏ-1 ప్రధాన ముద్దాయి కృష్ణారెడ్డి అరెస్ట్‌కు గాలింపు చర్యలు....



ముద్దాయిని అరెస్ట్ చూపుతున్న రూరల్ సిఐ, కసాపురం పోలీసులు.

**గుంతకల్లు, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామివారి దేవస్థానం ప్రతిష్టకు భంగకరం వద్దని, హిందూ ధర్మ రక్షణ నిమయాల పాటింపులో రాష్ట్ర దేవాదాయశాఖ చట్టనిభంధనల ఉల్లంఘన చర్యలకు పాల్పడిన వారి పట్ల చట్టపరమైన చర్యలు ఉంటాయని, శ్రీవారికి భక్తాదులు హుండీలలో సమర్పించుకున్న కానుకలను ఇటీవల చోటుచేసుకున్న దోపిడి సంఘటనలలో భాద్యులు ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని రూరల్ సిఐ ఓ.మహేశ్వరరెడ్డి తనదైనశైలిలో ఉద్ఘాటించారు. బుధవారం కసాపురం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఎస్సై గోపాలుడు అధ్వర్యంలో ఆయన హాజరుతో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల మేరకు... గత 17వతేదీ శ్రీ నెట్టికంటుని ఆలయంలో హుండీలలో భక్తాదులు తమ మ్రొక్కుబడులుగా శ్రీవారికి సమర్పించుకున్న కానుకలను చోరీ చేస్తున్న దృశ్యాలు సిసి కెమెరాలలో రికార్డు కావడంతో సదరు సంఘటన పట్ల దేవస్థాన ం అధికారుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. సదరు సంఘటనలో ఎ-1 ప్రధాన ముద్దాయిగా ఉన్న కాంట్రాక్ట్ విధులుగా సెక్యురిటీ గార్డుల ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి పరారీలో ఉన్నాడని, అతనిని అరెస్ట్ చేసేందుకు పలు బృందాలుగా తమ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టామన్నారు. అందులో ఎ-2 నిందితుడు ఆలయ అర్చకుడు దేశికాచార్యులును అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. ఇదిలా ఉండగా సదరు సంఘటన దేవస్థానం అప్రతిష్టకు కారణం దురదృష్టకరమని, భక్తాదుల మనోభావాలు దెబ్బతినకుండా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దేవాదాయశాఖ అధికార యంత్రాంగం గట్టి భద్రతాచర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈనెల 17వ తేదీన హుండీలలో శ్రీవారి కానుకల దోపిడి ఘటన దృశ్యాలు సిసి కెమెరాల నిఘాలో రికారు కావడంతో తమ విచారణలో ఆలయ అధికారుల విధినిర్వహణలో భాధ్యతారాహిత్యం తీరు కొత్త విషయాలు బయటపడ్డాయన్నారు. గత కొంతకాలంగా హుండీలలో కానుకల దోపిడీ తీరు సిసి కెమెరాల నిఘా దృశ్యాల ద్వారా స్పష్టమైందని, అందుకు సంబందించిన ఆధారాలుగా ఉన్న సిసి కెమెరా రికార్డు ఫుటేజీలను స్వాధీనం చేసుకుని పరిశీలించడం జరిగిందన్నారు. హుండీలో చోరీ చేసిన విషయం బయటపడ్డ రోజు మాత్రమే కాకుండా ఇతర రోజులలో కూడా సదరు ఎ-1 ప్రధాన ముద్దాయి కృష్ణారెడ్డి పలుమార్లు దోపిడీకి పాల్పడిన తీరు, ఈక్రమంలోనే ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న దేశికాచార్యులు కూడా హుండీలో చేతులను పెట్టి దోపిడికై విఫలయత్నం సాగించినట్లు సిసి కెమెరా ఫుటేజీ ఆధారంతో ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సదరు దోపిడి సంఘటనలో ప్రధాన ముద్దాయి కృష్ణారెడ్డి పరారీలో ఉన్నాడని, అతనిని త్వరలోనే అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరు పరుస్తామన్నారు. కాగా హుండీ కానుకల దోపిడి సంఘటనపై సోషల్ మీడియాలో అవాస్తవులుగా వస్తున్న కథనాల ప్రకారం తమపై ఎలాంటి ఒత్తిడి లేదని, నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కేసులు నమోదుతో న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామన్నారు. కాగా రాష్ట్ర దేవాదాయశాఖ చట్ట నిభంధనల మేరకు ఆయా తాళాలు ఎవరి వద్ద ఉండాలి, ఎవరు తెరవాలి, సదరు తాళాలు సెక్యూరిటీ గార్డులకు ఎవరు అందిస్తున్నారు అన్న అనుమానాలకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని దేవస్థానం అధికారులను కోరామన్నారు. ఇందులో కూడా నిభంధనలను అతిక్రమించిన తీరుంటే భాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించామన్నారు. ఇదిలా ఉండగా కేవలం 14రోజుల వరకు మాత్రమే సిసి కెమెరాల నిఘా ఫుటేజీలు ఉండటం, అందులోనే మూడు మార్లుగా చోరీలకు పాల్పడిన తీరు బయటపడటం, గత 20యేళ్లకు పైగా విధులను నిర్వహిస్తున్న ముద్దాయి దోషిగా పట్టుబడిన వైనంలో ఎన్నిమార్లుగా చోరీలుగా దోపిడి జరిగిందో ఆ దేవదేవునికే తెలియాలని, సదరు ముద్దాయి పట్టుబడితే తెరవెనుక భాగోతం అసలు దోషులు మరొందరో బయటపడతారో వేచిచూడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కసాపురం పోలీసు బృందం పాల్గొన్నారు.

## బళ్లారి జిల్లాలో రూ.12 కోట్లతో గురుభవనం నిర్మాణం

### - జిల్లా మంత్రి బి.నాగేంద్ర

**బళ్లారి, సెప్టెంబర్27, ప్రభాతవార్త ;** జిల్లాలో 22 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు కోరుతున్న గురుభవనం కట్టడాన్ని డీఎంఎఫ్ నిధుల కింద రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించడం జరుగుతుందని రాష్ట్ర యువజనసేవలు క్రీడాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బి.నాగేంద్ర తెలిపారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా సార్వజనిక విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో డా.సర్వేపల్లి రాధాక్రిష్ణన్ 130వ జయంతి సందర్భంగా గురుభవన్ ఆవరణలో జిల్లాస్థాయి ఉపాధ్యాయుల దినోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్న గురుభవనాన్ని త్వరలో నిర్మించి అంకితం చేస్తామని చెప్పారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల్ని మంత్రి నాగేంద్ర సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంలో జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

